క్లుప్తంగా

కార్ల్‌మార్క్స్ జయంతి

చర్ల: ప్రముఖ సిద్ధాంతకర్త కార్ల్‌మార్క్స్ జయంతి వేడుకలు ఆదివారం చర్లలో ఘనంగా జరిగాయి. చర్లలోని బీఎస్ రామయ్య భవన్ (సీపీఎం ఆఫీస్)లో ఏర్పాటు చేసిన కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడుతూ.. ప్రపంచ గతిని మార్చిన సిద్ధాత కర్త కారల్ మార్క్స్ అని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను రద్దు చేయించడం కోసం, శ్రమదోపిడీని నిర్మూలించేందుకు ఆయన ఎంతగానో పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బందెల చంటి, పామారు బాలాజీ, దొడ్డి హరినాగవర్మ, తాటి నాగమణి, పొడుపుగంటి సమ్మక్క పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అశ్వారావుపేట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నామ నాగేశ్వరరావు కారు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సంకా ప్రసాద్, మాజీ జడ్పీటీసీలు అంకత మల్లికార్జున్‌రావు, జేకేవీ రమణారావు, తాడేపల్లి రవి, బిర్రం వెంకటేశ్వరరావు, వెంకన్నబాబు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట గడ్డపై గులాభి జెండా ఎగరడం ఖాయమని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు అన్నారు. ఆదివారం మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ చిట్టయ్యగుంపులో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే కమలాపురం గ్రామంలో సైతం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ తాటి సరిత, కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, మాజీ ఎంపీటీసీలు వల్లభనేని రమణ, కాటిబోయిన సుజాత, మండల కోఆప్షన్ సభ్యుడు జావిద్‌పాషా, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వెంకటరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అన్నపురెడ్డిపల్లి: శనివారం మండలంలో వీచిన బలమైన గాలి దుమారానికి బూర్గొడెం గ్రామానికి చెందిన షేక్ ఆరిఫ్ రేకుల ఇళ్లు పూర్తిగా దెబ్బతింది. దీనితో విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువజన నాయకుడు వేముల హరీష్ ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని నియోజవర్గ నాయకురాలు వగ్గెల పూజ చేతుల మీదుగా అందజేశారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసే వరకు అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంతరం గాలివానకు మామిడి తోటలో నెలరాలిన కాయలను పరిశీలించి, ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సున్నా గోపాలరావు, కిరణ్, శివ, సుభాని, నవీన్, అనిల్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

భద్రాచలం(చర్లరూరల్): చర్ల మండలం లక్ష్మీ కాలనీలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు వైద్యశిబిరాన్ని కొనసాగిస్తున్నారు. కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్నవారి రక్త నమూనాలను సేకరించారు. చేశారు.అనారోగ్యంతో బాధపడుతున్న కొందరిని ఆర్‌బీఎస్‌కే వాహనంలో చర్ల పీహెచ్‌సీకి తరలించారు. ఇద్దరు కొడుకులను కోల్పోయిన తల్లి లక్ష్మి ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ శిరీష, శ్యాంప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్,హెల్త్ అసిస్టెంటు స్వరూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతాప సభ

ములకలపల్లి: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు యార్లగడ్డ భాస్కర్‌రావు అకాల మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఎంపీటీసీ కొర్రి భద్రం అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన యార్లగడ్డ సంతాప సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. తుది శ్వాస వరకూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి శ్రమించిన భాస్కర్ రావు చిరస్మరణీయుడని అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి ఎండి.యూసఫ్, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.జబ్బార్, బాణోతు హర్యా, వీరూనాయక్, పూనెం రాంచందర్, వీరభద్రా రెడ్డి, అనుమల సాయి పాల్గొన్నారు.

పని వేళలు మార్చాలి

మణుగూరురూరల్: ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పని వేళలను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్ట్ 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండేలా మార్పులు చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకటరత్నం యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు టీవీఎంవీ ప్రసాద్, లక్ష్మణరావు, రామ్మూర్తి, ఈశ్వరరావు, ప్రభాకర్ రావు, విల్సన్, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, భిక్షపతి, శ్రీనివాస్, రాజు, సుమన్ పాల్గొన్నారు.

ఆదాయం భళా.. అభివృద్ధి డీలా

- దమ్మపేట మార్కెట్‌కు రూ.కోట్లలో ఆదాయం
- ఏటా లక్ష్యానికి మించి పన్నుల వసూళ్లు
- అయినా అభివృద్ధికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం



దమ్మపేట వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం

దమ్మపేట: మార్కెటింగ్ శాఖకు రూ.కోట్లలో ఆదాయాన్ని దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సమకూరుస్తున్నా.. కమిటీ ఆధ్వర్యాన నామమాత్రంగా కూడా అభివృద్ధి పనులు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. గడిచిన పదేళ్లలో మార్కెట్ కమిటీ నిధులతో చేసిన పనులేవీ లేవనే చెప్పాలి. దమ్మపేట మార్కెట్ పరిధిలో దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాలు ఉండగా.. మూడు చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయి. గత ఏడేళ్లలో ఏటా రూ.కోటికి పైగా ఆదాయం వస్తున్నప్పటికీ మూడు మండలాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడం గమనార్హం.

ఆదాయ వనరులు

మార్కెట్ కమిటీకి ప్రధానంగా చెక్‌పోస్టుల ద్వారా ఆదాయం లభిస్తోంది. అలాగే, గోదాంల అద్దె ద్వారా కూడా ఆదాయం సమకూరుతోంది. మూడు మండలాల పరిధిలో వరి, మొక్కజొన్న, జీడిమామిడి, మామిడి, వేరుశనగ పంటలను రైతులు సాగుచేస్తున్నారు. వీటిని వ్యాపారులు తరలించే సమయాన చెక్‌పోస్టుల వద్ద పంట విలువలో ఒక శాతం సెస్‌గా చెల్లిస్తారు. ఇక సివిల్ సప్లయీస్, జీసీసీ అధికారులు పంట ఉత్పత్తులను గోదాంల్లో నిల్వ చేసి అద్దె చెల్లిస్తున్నారు. కాగా, ఏటా మార్కెట్ లక్ష్యం రూ.కోటిపైగా ఉండగా చాలాసార్లు లక్ష్యానికి మించి వసూలవుతోంది. 2018–19, 2019–20, 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాల్లో లక్ష్యాలను సాధించలేకపోయినా ఆదాయం మాత్రం రూ.కోట్లలో సమకూరింది. ఇక 2023–24లో నిర్దేశిత లక్ష్యం రూ.2.18 కోట్లకు గాను రూ.2.83 కోట్లు ఆర్జించగా రికార్డు నమోదైంది.

గతంలో చేపట్టిన అభివృద్ధే...

దమ్మపేట మార్కెట్ ద్వారా లింక్ రోడ్లు, గోదాంల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జరిగేవి. పదేళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లు ప్రసుత్తం పూర్తిగా పాడైతే కొత్త నిర్మాణాల మాటేమో కానీ మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దమ్మపేటలో ప్రధాన రహదారి నుండి మార్కెట్ కార్యాలయానికి వెళ్లే దారిని సీసీ రోడ్డుగా పదేళ్ల క్రితం కమిటీ నిధులతో నిర్మించారు. ప్రస్తుతం ఈ రహదారి గుంతలమయంగా మారింది. మార్కెట్‌కు ఈ రహదారి మీదుగా సరుకుల వాహనాలు వచ్చివెళ్తుంటాయి. కాగా, ఈ రోడ్డు మరమ్మతులను మార్కెట్ కమిటీ పట్టించుకోకపోగా.. అటు గ్రామపంచాయితీ సైతం కన్నెత్తి చూడకపోవడంతో రెంటికి చెడ్డ రేవటిలా మారింది. ఇకనైనా మార్కెట్ కమిటీ నిధులతో రహదారుల మరమ్మతులు చేపట్టడమే కాక కొత్త అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతలమయమైన సీసీ రోడ్డు

గత ఏడేళ్లలో దమ్మపేట మార్కెట్ ఆదాయం (రూ.కోట్లలో)

సంవత్సరం	లక్ష్యం	ఆదాయం
2017-18	1.62	1.68
2018-19	1.75	1.23
2019-20	2.05	1.17
2020-21	2.25	1.68
2021-22	1.72	1.66
2022-23	2.10	2.22
2023-24	2.18	2.83

రోడ్డును పునఃనిర్మించాలి


దమ్మపేట ప్రధాన రహదారి నుండి మార్కెట్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు గుంతలమయంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో మరింత ఛిద్రమవుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డును పునర్ నిర్మించాలి.

– నక్కా వెంకటేశ్వరరావు, దమ్మపేట

అధికారిక అనుమతులు లేవు


మార్కెట్ పరిధి మండలాల్లో లింక్ రోడ్లు, గోదాంల నిర్మాణానికి అనుమతులు లేవు. పదేళ్ల క్రితం పనులు జరిగేవి. దమ్మపేట మార్కెట్‌కు వచ్చే సీసీ రోడ్డు మరమ్మతులు, పునర్ నిర్మాణానికి అనుమతి వస్తే పనులు చేపడుతాం.

– రాము, మార్కెట్ కార్యదర్శి

ఉరుములు, మెరుపుల వాన


కరకగూడెం: పిడుగుపాటుకు కాలిపోతున్న వేప చెట్టు


గుండాల: భారీ వర్షంతో పడిన వడగండ్లు

గుండాల: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో వర్షంతో పాటు పెద్దపెద్ద రాళ్లు పడ్డాయి. మండల కేంద్రంలో ఇండ్లపక్కనే పిడుగులు పడ్డాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళకు గురైయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అంతర్గత రోడ్లపై వరద నీరు చేరింది. అక్కడక్కడ చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. గాలిదుమారంతో మామిడికాయలు నేలరాలాయి. కరెంటుకు అంతరాయం ఏర్పడింది. ఈ వానతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

పిడుగుపాటు..

కరకగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్ల బడింది. దీంతో వేసవి తాపంతో బాధపడుతున్న మండల వాసులకు కాస్త ఉపశమనం లభించింది. అలాగే చొప్పాల పంచాయతీ చొప్పాల గ్రామంలోని మునలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఉన్నటువంటి వందల సంవత్సరాల వేప చెట్టుపై ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి తోడు పిడుగు పడడంతో చెట్టు కాలిపోయింది.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి


ఓటర్‌కు కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘురాం రెడ్డిను అత్యధిక మోజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు జూపల్లి రమేష్ కోరారు. ఆదివారం మండలంలోని మద్దికొండ, అచ్యుతాపురం, నారంవారిగూడెం, నారంవారిగూడెం కాలనీతోపాటు పలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల పేదలకు అందాలంటే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలకు ఎన్నికల ప్రచార సామగ్రి, పోస్టర్లును అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మా రాంబాబు, సుంకవల్లి వీరభద్రరావు, కాసాని మురళి, నంద్రు రమేష్, అల్లాడి వెంకటరామారావు, దండాబత్తుల రమేష్ పాల్గొన్నారు.

గడపగడపకు ప్రచారం

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ, ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపును కాంక్షిస్తూ, మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. దమ్మపేట గ్రామంలోని పలు వీధుల్లో హస్తం గుర్తుకే ఓటేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో ప్రస్తుతం అమలు చేస్తున్న గ్యారెంటీలను, ఎంపీ ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, పందేటి వెంకటేశ్వరరావు, పసుమర్తి చిన్నబాబు, చక్కిరాల మల్లేశ్వరరావు, పగడాల కృష్ణ, కృష్ణమూర్తి, తాళ్ల శంకర్, రొయ్యల కుమార్, ఉలవల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు చల్లా పుల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లోక్ సభ ఎన్నికలలో పార్టీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు యాదాల వెంకటేశ్వర్లు, రుంజా బుచ్చమ్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం'


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

గుండాల: తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చి ఆ హామీలను అమలు పర్చడంలో పూర్తిగా విఫలమవుతుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం గుండాల, ఆళ్లపల్లి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇంకా పూర్తిగా అమలు చేయడం లేదని తెలిపారు. మాయమాటలతో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని వస్తున్నారని, కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. మహిళలకు రూ. 2500లు, రెండు లక్షల రుణమాఫీ,రూ. 15వేల రైతు బరోసా, వరికి రూ.500ల బోనస్‌లు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫలమయిందని విమర్శించారు. రాష్ట్రంలో కొత్తజిల్లాల రద్దును చేసే ఆలోచనను మానుకోవాలని, రద్దు చేస్తే అభివృద్ధిలో తీవ్ర నష్టం వాటిళ్లుతుందని తెలిపారు. ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నియోజక వర్గ నాయకులు భవానీ శంకర్, వట్టం రాంబాబు, పార్టీ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాయం నర్సింహరావు, ఎస్‌కె.బాబా, లెల్లం భాస్కర్, రవీందర్, జెడ్పీటీసీ హన్మంతరావు, ఎంపీపీ మంజు భార్గవి, నర్సింహరావు, వెంకటనారాయణ, రాములు, గడ్డం రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి

చర్ల: మతోన్మాద ఫాసిస్టు బీజేపీని, దాని మిత్ర పక్షాలను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ పిలుపు నిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మాస్‌లైన్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కొండా చరణ్ ఓటర్లతో మాట్లాడారు. తెలంగాణాలో బీజేపీ పాగా వేసేందుకు ఠక్కు, ఠమారా విద్యలు చేస్తోందని ఎద్దేవా చేశారు. బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలోని రానీయ వద్దని ఆయన కోరారు. తెలంగాణాలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ కొనసాగబోతోందని, ప్రజాస్వామిక, లౌకికశక్తులు బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రచారంలో పార్టీ మండల కార్యదర్శి కొండా కౌశిక్, నాయకుడు మోహనరావు పాల్గొన్నారు.

ఓబీ వర్కర్ల సమస్య పరిష్కరించండి

మణుగూరురూరల్: ఓబీ వర్కర్ల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని మణుగూరు ఏరియా కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం దుర్గా, మహలక్ష్మి కంపెనీల్లో విధులను బహిష్కరించి సమ్మె చేపట్టిన ఓబీ వర్కర్ల శిబిరాన్ని వారు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓబీ వర్కర్ల వేతన పెంపు, ఇతర సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఏరియా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకుని ఒప్పందం చేసి కార్మికులకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, పెనుగొండ నాగార్జున, గడ్డం వెంకటేశ్వర్లు, సురేందర్, గద్దల శ్రీనివాసరావు, వరదల సమ్మయ్య, కందగట్ల సురేందర్, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షలతో ప్రావీణ్యం


భద్రాచలంటౌన్: పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న నోడల్ అధికారి సులోచనా రాణి

భద్రాచలంటౌన్: విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు అవకాశం ఉన్న మేరకు మోడల్ పరీక్షలలో పాల్గొని ప్రావీణ్యం పెంచుకోవాలని మండల నోడల్ అధికారి సులోచనా రాణి సూచించారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎంసెట్ మోడల్ పరీక్ష పత్రాలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఎంసెట్ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ మోడల్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతుందని, పరీక్షల సమయాలలో విద్యార్థులు భయాన్ని వీడి ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ మోడల్ పరీక్షలో సుమారు 90 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని పరీక్ష రాశారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్స్ కళాశాల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు, అధ్యాపకులు బషీర్ పాల్గొన్నారు.

బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో..

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎంసెట్ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 83 మంది విద్యార్థులు ఎంసెట్ మోడల్ పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ కళాశాల చైర్మన్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతు ఈ నెల 7వ తేదీన జరగనున్న ఎంసెట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ మోడల్ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. ఎంసెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

బీజేపీని ఆదరించండి


ఓట్లు అభ్యర్థిస్తున్న తాండ్ర వినయ్

ములకలపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని ఆదరించాలని పార్టీ యువనాయకుడు, ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు తనయుడు తాండ్ర వినయ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని సాయిరాంపురం, మూకమామిడి, మొగరాల గుప్పగ్రామాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే తాండ్ర వినోదరావును గెలిపించాలని కోరారు. ఇంటింటికీ తిరుగుతూ కమలం గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అనుమల శ్రీనివాస్, శనగపాటి సీతారాములు, అత్యం సాయి, పైడి మర్రిసాయి, గొడ్లరాజు, మాణిక్యాల అనిరుద్, వనమా పార్థు, శనగవరపు రాము, గూగుల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మహబాబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆదివారం మున్సిపాలిటి పరిధిలోని బూత్ నెంబర్ 128, 129లలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో ప్రధాని మోడి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను నాయకులు ప్రజలకు వివరిస్తూ.. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంట భద్రయ్య, ఈసాల వెంకటేశ్వర్లు, భోగే చందర్‌రావు పాల్గొన్నారు.

కల సాకారమవుతున్న వేళ!

- ఎట్టకేలకు అల్లిగూడెంకు బీటీ రోడ్డు నిర్మాణం
- ఆదివాసీలకు తప్పనున్న తిప్పలు


చెరువు కట్ట మీద నడుచుకుంటూ బడికి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

ములకలపల్లి: ఆ గ్రామం ఏర్పడి అర్ధ శతాబ్ద కాలం గడుస్తున్నా.. పక్కా దారిలేదు. అత్యవసర పరిస్థితుల్లోనూ అంబులెన్స్ వచ్చే అవకాశమేలేదు. ఈ ఊరు చేరాలంటే సుమారు కిలోమీటర్ దూరం నడవాల్సిందే. చెరువు కట్ట దాటుతూ, పత్తిచేల మధ్య గుండా ముందుకు సాగాల్సి ఉంటుంది. అయితే ఇటీవల బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకాగా.. పనులు మొదలయ్యాయి. దీంతో తమ నడక కష్టాలు తప్పుతున్నాయని స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ములకలపల్లి మండలం పూసుగూడెం జీపీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామలో 25 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయమే వీరి జీవనాధారం. ఈ గ్రామం ఆవిర్భవించి, 50 ఏళ్లు పైబిలుకు అవుతున్నా.. రోడ్డు సౌకర్యమే లేదు. చెరువు కట్టే వీరి రహదారి.

నర(డ)క యాతన..

కొమ్ముగూడెం గ్రామం నుండి తెల్లవాగు చెరువుకట్టపై నడస్తూ, అటుపిమ్మట పత్తిచేలను, తోటలను దాటివెళ్లాలి. వర్షాకాలంలో వీరి నడక కష్టాలు వర్ణనాతీతం. వానలకు చెరువుకట్ట బురదమయంగా నరక యాతన అనుభవిస్తున్నామని స్థానికులు దీనంగా చెపుతున్నారు. పూసుగూడెం, సుబ్బనపల్లి గ్రామాల్లోని స్కూళ్లకు వెళ్లే చిన్నారులు బురదలో జారిపడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆస్పత్రులకు, ఇతర అత్యవసరాల సమయంలోనూ వాహనాలు వెళ్లే వీలులేకపోవడంతో, బైక్‌లు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. వర్షాకాలంలో ఆ మాత్రం అవకాశం కూడా లేదు. ఇక గర్భిణులకు కాన్పు సమయానికి ముందస్తుగా బంధువుల ఇళ్లకు తీసుకెళ్లాల్సి వస్తోంది.

కొనసాగుతున్న రోడ్డు పనులు..

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, కొమ్ముగూడెం నుండి అల్లిగూడెం వరకూ బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.1.12 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత అక్టోబర్ మాసంలో అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పనులను ప్రారంభిస్తూ, భూమిపూజ చేశారు. ఎన్నికల నేపథ్యంలో కొన్నాళ్లు పనులు నిదానించినప్పటికీ ఇటీవల మళ్లీ మొదలు పెట్టారు. తెల్లవాగు చెరువు కట్టను మరింత పటిష్టపరిచి, వెడల్పు చేశారు. జీఎస్‌బీ పరిచి, రోలింగ్ చేశారు. పత్తిచేను పక్కనే ఉన్న జామాయిల్ తోటలో గుండా పక్కా రోడ్డును వేస్తున్నారు. ఈ మేరకు మట్టితోలకాలు మొదలుపెట్టగా.. ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. కొమ్ముగూడెం గ్రామ శివారులో తెల్లవాగు చెరువు అలుగు దాటేందుకు మినీ వంతెన నిర్మాణ పనులు సైతం సాగుతున్నాయి. త్వరితంగా పనులు పూర్తిచేసి, రానున్న వర్షాకాలంలో అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంబులెన్స్ రాకపోకలూ కష్టమే..


రోడ్డు సౌకర్యంలేక అంబులెన్స్ కూడా వచ్చే వీలుండేది కాదు. రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు బాగా ఇబ్బంది అయ్యేది. ఏదైనా పనిమీదు బయటికి వెళ్లాలంటే కిలోమీటర్ దూరం నడవాల్సి వచ్చేది. రోడ్డు పూర్తయితే వాహనాలు తిరిగే వీలుంటుంది.

– నదియం రోజా, స్థానికురాలు

నడక కష్టాలు తప్పినట్లే


సీజనల్ వ్యాధుల సమయంలో అత్యవసరంగా బయటికి వెళ్లాలంటే చాలా శ్రమ పడాల్సివచ్చేది. ఇక వర్షాకాలంలో చెరవు కట్టపై కనీసం బైక్‌లు కూడా వెళ్లేవికావు. చాలా ఇబ్బంది పడే వాళ్లం. రోడ్డు పూర్తయితే మా నడక కష్టాలు తప్పినట్లే.

– నదియం మత్తు, స్థానికుడు

జూన్ నెలాఖరులోగా పూర్తి


ఇప్పటికే రోడ్డు పనులు మొదలయ్యాయి. ఆ మేరకు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జూన్ నెలాఖరులోగా పనులు పూర్తి అయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. వర్షాకాలంలోగా బీటీ రోడ్డును అందుబాటులోకి తెస్తాం.

– సుబ్బరాజు, ఏఈ, ఐటీడీఏ